

బిజెపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయ్ : పిసిసి

రాజంపేట అర్బన్ : బిజెపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయని పిసిసి కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా చేతుల్లో నుంచి కాపాడానికే రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేపట్టారన్నారు. జోడో యాత్ర విజవంతం అవ్వడంతో మోదీ, అమిత్‌షాలకు కంటి మీద కునుకు లేకుండా పోయిందన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువులు ధరలు పెరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పాండురంగయ్య, మండల అధ్యక్షులు లేబాకు రవి, పట్టణ అధ్యక్షులు షైక్ మహమ్మద్, కాంగ్రెస్ పార్టీ నందలూరు అధ్యక్షులు సుబ్బరాయుడు, నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

నిరసనల హోరు



కడప : అంబేద్కర్ విగ్రహం ఐక్యవేదిక నాయకులు నిరసన

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొండిచేయి చూపడంపై జిల్లాలో గురువారం నిరసనలు వ్యక్తమయ్యాయి. సిపిఎం, సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి డౌన్‌డౌన్, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలి, కడప-బెంగళూరు రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలి, రాష్ట్రానికి నిధులు పెంచాలని అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఉక్కు పరిశ్రమ కోసం ఉద్యమం ఉధృతం

కడప అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసిందని, విభజన చట్టం హామీలను తుంగలో తొక్కిందని ఉక్కు సాధన ఐక్యవేదిక అధ్యక్షులు బి.నారాయణ విమర్శించారు. గురువారం అంబేద్కర్ సర్కిల్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమకు, వలసలు కరువుతో అల్లాడుతున్న ప్రజలకు ఉద్యోగ ఉపాధి కల్పించే ఉక్కు పరిశ్రమ ఆవేదన వ్యక్తం చేశారు. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై హామీ ఇచ్చి ఎనిమిది సంవత్సరాలు అవుతున్న ఏర్పాటుకు ప్రయత్నాలే చేయక పోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కేంద్ర బడ్జెట్ బాగుందని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రాయలసీమ, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. దీనికోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం ఐక్యవేదిక నాయకులు సత్తార్, గుర్రప్ప, సిఆర్‌వి ప్రసాద్, పాపిరెడ్డి, ఎమ్మార్ నాయక్, రాజేంద్రప్రసాద్, ఓబులేసు, సురేష్ నాయక్, అంజి, జితేంద్ర పాల్గొన్నారు.

వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు చూపని బడ్జెట్

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గిస్తే రైతుల ఆదాయం ఏ రకంగా రెట్టింపు అవుతుందని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ ప్రశ్నించారు. గురువారం పాత బస్టాండ్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించి సంక్షోభం ఏ రకంగా నివారిస్తారని తెలిపారు. పిఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు ఇస్తున్నారని, ఇది ఏ మాత్రం చాలడం లేదన్నారు. వ్యవసాయ సాగు ఖర్చులు రెట్టింపు అయ్యాయని, బడ్జెట్‌లో పిఎం కిసాన్ పథకం పథకాన్ని కూడా రెట్టింపు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రా రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుంకర రవి పాల్గొన్నారు.

అల్ప సంఖ్యాక వర్గాల వ్యతిరేక బడ్జెట్ : సిపిఎం

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, నిరుద్యోగ, రైతు, అల్ప సంఖ్యాక వర్గాల వ్యతిరేక బడ్జెట్‌గా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం గడిచిన ఎనిమిదేళ్లుగా మాటలతో ప్రజలను మభ్యపెడుతోందన్నారు. కాగితాలలో బడ్జెట్ పెరిగిందని, ప్రజల నిజజీవితంలో కొనుగోలు శక్తి బాగా బలహీన పడిందని తెలిపారు. బడ్జెట్ వాస్తవ పరిస్థితులను వక్రీకరించే విధంగా ఉందన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

విద్యా రంగం పట్ల నిర్లక్ష్యం : ఎస్ఎఫ్ఐ

విద్యా రంగం పట్ల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిర్లక్ష్యం వహించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.ఆర్.నాయక్ విమర్శించారు. విద్య కోసం వాటా 2022-23 బడ్జెట్ అంచనా మొత్తంలో 2.64 శాతం నుంచి బడ్జెట్ అంచనాలో 2.50 శాతానికి క్షీణించిందని తెలిపారు. బడ్జెట్‌లో విద్యకు జిడిపిలో 3 శాతం కూడా హామీ ఇవ్వలేదని తెలిపారు. ఇది కొత్త విద్యా విధానంలో వాగ్దానం చేసిన దానిలో సగం మాత్రమే. జాతీయ విద్యా మిషన్‌కు బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించారని చెప్పారు.

'ఉక్కు'ను మరచిన కేంద్రం : డివైఎఫ్ఐ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): కేంద్ర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కును విస్మరించడం దారుణమని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలను విస్మరించిందని అందులో ప్రధానంగా కడప ఉక్కు పరిశ్రమను నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. ఉక్కుకు నిధులు కేటాయిస్తారని జిల్లా ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగ యువకులకు ఆశగా ఎదురు చూసారని వారికి ప్రతి సారి నిరాశే ఎదురు అవుతుందన్నారు. కడప ఉక్కుకు నిధులు కేటాయించాలని లేని పక్షంలో పోరాటాలు సాగిస్తామని, ఈ పోరాటంలో యువత, విద్యార్థులు కలసి రావాలి అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు సురేశ్ నాయక్, అజయ్, రాహుల్, ఉదయ్ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కుకు నిధులు కేటాయించకుండా బిజెపి ప్రభుత్వం విస్మరిస్తుందని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు విమర్శించారు. పూలే సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు యూసఫ్, జగదీష్, శ్రీకాంత్ చిన్న, నవీన్, మణి, గౌస్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

జమ్మలమడుగు రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల, నిరుద్యోగ, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి, రాయలసీమకు, కడప ఉక్కుకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సిపిఎం అధ్వర్యంలో పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి అనంతరం బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, నాయకులు దాసు, రవి, రఘు పాల్గొన్నారు.

ఎపికి టోపీ పెట్టిన కేంద్రం : పిసిసి

వేంపల్లె : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టోపీ పెట్టిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల, గ్రామీణుల, పేదల, నిరుద్యోగుల వ్యతిరేక బడ్జెట్ గా మారిందని చెప్పారు. అప్పుల మీద ఆధారపడ్డ బడ్జెట్‌గా ఉందని చెప్పారు. ఇప్పటికే దేశం అప్పులకుప్ప అయిందనన్నారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని చెప్పారు. ప్రత్యేక హోదా ప్రస్తావన లేక పోవడంతో పాటు రైల్వే జోన్ ఊసే లేదని చెప్పారు. పోలవరాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు.

జగన్ రాజీనామా చేయాలి

కడప: కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరగడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతకానితనం ఎక్కువగా ఉందని, దీనికి బాధ్యత వహించి రాజీనామా చేయాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ డిమాండ్ చేశారు. గురువారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచుతానన్న జగన్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్లో అన్యాయం జరిగితే ఏం సమాధానం చెబుతాడని ప్రశ్నించారు. బడ్జెట్ విడుదల కాకముందే ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్ బాగుందనడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, కడప జిల్లా కోఆర్డినేటర్ హరి ప్రసాద్, రాష్ట్ర నేతలు ప్రభాకర్, నజీర్ అహ్మద్, బండి జకరయ్య, సత్తార్, జోడు నాగరాజు, తిరుమలేష్, అలీ ఖాన్, ఆరీఫుల్లా, శ్యామలాదేవి, చెప్పలి పుల్లయ్య, గొర్ల శ్రీనివాసులు, మీడియా కోఆర్డినేటర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, నాసిర్ ఖాన్, సాదిక్, గౌరీ, వంశి, సమీరా పాల్గొన్నారు.



కడప : బడ్జెట్ ప్రతులు దగ్ధం చేస్తున్న నాయకులు

'పుట్లంపల్లి'పై గ్రావెల్ గద్దలు

- ట్రాక్టర్ల మాటున మెగా టిప్పర్లతో తరలింపు
- 2019లో జారీచేసిన జిఒ పేరుతో అనుమతులు!
- నిద్రావస్థలో ఇరిగేషన్, రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పుట్లంపల్లి చెరువు పూడికతీత పనుల మాటున ఇష్టారాజ్యంగా గ్రావెల్ తరలిపోతోంది. 2019 నాటి జిఒను అడ్డుపెట్టుకుని ట్రాక్టర్ల పేరుతో మెగా టిప్పర్లతో గ్రావెల్‌ను తరలింపు వ్యవహారం యథేచ్ఛగా సాగిపోతోంది. జిల్లాలోని రెవెన్యూ, ఇరిగేషన్ ఉన్నతాధికారులు రైతులు, ఇతరుల అవసరాల నిమిత్తం గ్రావెల్ తరలించుకోవచ్చని ఉత్తర్వులు ఇవ్వడమే ఆలస్యంగా గ్రావెల్ తరలిపోతోంది. పూడికతీత పనులకు అనుమతులు పొందిన వ్యక్తి ఇష్టాను సారంగా కడప పట్టణ పరిధిలోని ఇతర లేఅవుట్లకు గ్రావెల్ తరలిస్తున్నారు.

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని పుట్లంపల్లి, దేవుని కడప, రామన్ చెరువు ఉన్నాయి. పుట్లంపల్లి చెరువు సుందరీకరణ పేరుతో నీటి పారుదల శాఖ యంత్రాంగం రెండు దఫాలుగా టెండర్లు పిలిచింది. గత ఏడాది ఆగస్టు 18న, అక్టోబర్ 11న టెండర్లు పిలిచింది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రద్దు చేసింది. తాజాగా మూడవ విడత టెండరులో భాగంగా ఇరిగేషన్, రెవెన్యూ యంత్రాంగం రైతులతోపాటూ ఇతరులు కూడా గ్రావెల్ తరలించుకోవడానికి అనుమతులు ఇచ్చింది. ఇది అక్రమ రవాణాకు ఆసరాగా మారింది. నిబంధనల్లో తెలిపిన మేరకు ట్రాక్టర్లను మాత్రమే వినియోగించుకోవాలని సూచించింది. ఆచరణలో సంబంధిత అనుమతులు పొందిన వ్యక్తి నిబంధనలు పాటించకుండా ఒకవైపు ట్రాక్టర్లు, మరోవైపు మెగా టిప్పర్లతో భారీగా గ్రావెల్‌ను తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. పుట్లంపల్లి చెరువులో పూడికతీత పనుల పేరుతో సాగుతున్న గ్రావెల్ తరలింపు వ్యవహారం రియల్ ఎస్టేట్, వెంచర్లు, ఇతరుల అవసరాలకు యథేచ్ఛగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అనుమతులు ఇచ్చిన ఇరిగేషన్, రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలవుతున్నాయా, లేదా అనే పర్యవేక్షణ కొరవడిన ఫలితంగా ఇష్టారాజ్యంగా గ్రావెల్ తరలింపు వ్యవహారం సాగిపోతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని కమలాపురం, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె మండలాల్లో మట్టి, ఇసుక, గ్రావెల్ తరలింపు వ్యవహారం జోరుగా సాగుతుండడంపై విమర్శలవర్షం కురిసన సంగతి తెలిసిందే. తాజాగా కడప మండల పరిధిలోని చెరువుల్లోనూ పూడికతీత పనుల పేరుతో రియల్‌ఎస్టేట్ ఇతర అవసరాలకు గ్రావెల్ తరలింపు వ్యవహారం సాగుతుండడం చర్చనీయాంశంగా మారింది. పుట్లంపల్లిలో బోటింగ్ సదుపాయం అధికారులకు ఎరుక, కానీ ఇష్టానుసారంగా పూడికతీత పనులు చేపడితే చెరువులో నీరు నిలవడం అసాధ్యమనే వాదన వినిపిస్తోంది. ఇష్టారాజ్యంగా పూడికను తొలగిస్తే సుందరీకరణ స్థానంలో నిర్జీవత్వం రాజ్యమేలే అవకాశాలు ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం సకాలంలో స్పందించి సుందరీకరణ పేరుతో సాగుతున్న పూడికతీత తరలింపును అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. దీనిపై తహశీల్దార్, ఆర్‌డిఓలను ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.


చెరువులో అక్రమంగా తరలిస్తున్న మట్టి

జగనన్న కాలనీలకు విద్యుత్ సరఫరా

- ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ సంతోష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్‌రావు

ప్రజాశక్తి - కడప

జగనన్న కాలనీలలో పూర్తయిన ఇండ్లకు వెంటనే విద్యుత్ మీటర్ బిగించి విద్యుత్ సరఫరా చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్‌రావు ఆదేశించారు. గురువారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటే దేశం బాగుంటుందని తెలిపారు. రైతులు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసు కొరకు దరఖాస్తు చేసుకొని అవసరమైన రుసుం చెల్లించిన వెంటనే జాప్యం లేకుండా సర్వీసులు విడుదల చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు తమ పనితీరును మెరుగు పరుచుకోకపోతె చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగులలో మార్పు కోసం అనేక అవకాశాలు ఇచ్చాం, ఇప్పటికి మారని వారిపై చర్యలు తప్పవు, ఒకసారి చర్యలు తీసుకుంటే వెనక్కి తీసుకునేది ఉండదని హెచ్చరించారు. ప్రమాణాల ప్రకారం వినియోగదారుల విద్యుత్తు సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన నిరంతర 24 గంటల విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఒఎస్‌డి శ్రీనివాసులు, చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.మునిశంకరయ్య, కడప, అన్నమయ్య జిల్లాల సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జె.చిన్న రాఘవులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిఇఇలు, ఎఇలు, అకౌంట్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎసిబి అధికారులు

తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఎసిబి అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎసిబి డిఎస్‌పి కంజాక్షన్, సిఐలు ఎల్లంరాజు, కృష్ణమోహన్, షేక్ మహమ్మద్ అలీ, ఎస్ఐలు నరేష్, షేక్ నౌషాద్ అలీ బాషా, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, వారి సిబ్బందిని విచారించారు. రికార్డుల తనకి నిర్వహించారు. 14400-స్పందనలో వచ్చిన కొన్ని దరఖాస్తులపై ఎసిబి అధికారులు వారిని విచారించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ తనిఖీలు అనంతరం తహశీల్దారు కార్యాలయంలో ఎటువంటి అవకతవకలు జరిగాయో వాటిపై తగు చర్య తీసుకునేందుకు ప్రభుత్వం, ఎసిబి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామని పేర్కొన్నారు. ఎవరైనా సామాన్య ప్రజలు వివిధ సందర్భాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు వారి పనుల నిమిత్తం వెళ్లినప్పుడు ఎవరైనా ప్రభుత్వ అధికారులు గానీ, వారి సిబ్బంది గాని లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే 14400-స్పందన టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి గాని లేదా కడప ఎసిబి డిఎస్‌పి మొబైల్ నెంబర్ 9440446191, లేదా కార్యాలయం ఫోన్ నెంబర్ 08562-243708కు గాని లేదా స్వయంగా కార్యాలయంలో కలిసైనా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.

అవకతవకలకు ఆస్కారం ఉండకూడదు : పీడీ

ప్రజాశక్తి - చెన్నూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీలో భాగంగా గురువారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు, డ్వామ పీడీ యదుభూషన్‌రెడ్డి ఆధ్వర్యంలో 10 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఏపే పనులు చేపట్టారు, ఎంతెంత ఖర్చు చేశారో వివరంగా ప్రతిపనికి సంబంధించిన నివేదికలు చదివి వినిపించారు, 2021 ఏప్రిల్ నుంచి గత ఏడాది డిసెంబర్ వరకు 16వ విడత సామాజిక తనిఖీకిలో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు ప్రజా వేదిక సందర్భంగా తెలియజేశారు. రూ.ఐదు కోట్ల వరకు గుర్తించిన పనులపై ఖర్చు చేసినట్లు వారు సభ వేదిక మీదుగా ప్రజలకు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో తెలిపారు. రామనపల్లె, ఓబులంపల్లె, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, విషయంలో పీడీ అసహనం వ్యక్తం చేశారు, మాస్టర్ల విషయంలో సక్రమంగా లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని ఆయన వారిని హెచ్చరించారు, ఉపాధి హామీ పథకంలో మండల వ్యాప్తంగా జరిగిన పనులపై ఆయన ఆరా తీశారు. రైతులకు సంబంధించిన పంట కాలువలు వంటి వాటిపై దృష్టి సారించి రైతులకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ గంగనపల్లి సురేష్ బాబు, డివిఒ సోమశేఖర్‌రెడ్డి, అబుడ్సన్‌మెన్ యోగాం జనేయరెడ్డి, సాంబశివారెడ్డి, ఎస్ఆర్‌పి అంజలి, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్ పాల్గొన్నారు.



డ్రైవర్ కె.ఎం.బాషాను సన్మానిస్తున్న అధికారులు

ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకం

ఆర్‌టిసి ఇడి గోపీనాథ్‌రెడ్డి

కడప అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకమని ఇడి గోపీనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆర్టీసీ సమావేశ మందిరంలో ఉత్తమ డ్రైవర్లకు మెమోంటో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లను తీసుకునే ముందు అన్ని పరీక్షలు చేసి ఎంపిక చేస్తుందని పేర్కొన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడడం నిషేధమన్నారు. ఆరోగ్య పరీక్షలను యధావిధిగా చేయించుకోవాలని చెప్పారు. ఒత్తిడిని తగ్గించుకొని ప్రశాంతమైన డ్రైవింగ్ ను చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. డిటిసి వీరప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. వేగమే ప్రమాదానికి కారణమని చెప్పారు. రోడ్డుకు అడ్డంగా బస్సు ఆపిన సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసిన కేసు పెడతామని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికైన కె.ఎం.బాష, రీజన్, జోనల్, జిల్లా స్థాయి ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎం, డిఎం, డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.

'మరుగుదొడ్ల నిర్మాణాలు దారుణం'

కడప అర్బన్: నగరంలోని దిశ పోలీస్ స్టేసన్ సమీపంలోని హజరత్ సయ్యద్ మెహర్‌అలీషా దర్గా వద్దా కార్పొరేషన్ అధికారులు చేపట్టిన పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణాన్ని గురువారం ప్రజాసంఘాల నాయకులు అడ్డుకున్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి పూనుకోవటం దారుణమని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, ఎన్ఆర్‌జె ఏసీ కన్వీనర్ అహమ్మద్ బాబు బాయ్, టిడిపి మాజీ నగర అధ్యక్షులు క్రిస్టియన్ జిలాన్ మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్న స్థలంలో మౌనంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్గాకు సంబంధించిన ఈ ప్రాంతంలో అధికారుల దృష్టికి తీసుకుపోయినా కూడా మరుగుదొడ్లు నిర్మించడానికి ముందుకు వచ్చిన వారిని చూస్తుంటే ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా కార్పొరేషన్ ఇబ్బంది, కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించి పనులను ఆపాలన్నారు. కార్యక్రమంలో తన్వీర్ అహ్మద్ జాకీర్ హుస్సేన్ మహమ్మద్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న ముస్లిం సంఘాల నాయకులు


రైతులతో మాట్లాడుతున్న జెడి నాగేశ్వరరావు

పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి - వల్లూరు

రబీ పంట కాలానికి సంబంధించిన ఇ-క్రాప్‌బుకింగ్ జాబితా రికార్డులను జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పరిశీలించారు. గురువారం మండల కేంద్రంలోని తప్పెట్ల కుమారునిపల్లి గ్రామాల్లో రబీలో సాగుచేసిన వేరుశనగ, మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ లాభాదాకమైన పంటలు సాగు చేయాలని పంటలపై తగిన మెలకువలు పాటించాలని అధిక దిగు సాధించాలని తెలియజేశారు. రైతులు పంట వేసిన తర్వాత ఇ-క్రాప్ చేయించుకుంటేనే పథకాలు అమలులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సాయి జ్యోతి విహెచ్ఎ నిహారిక రైతులు పాల్గొన్నారు.

సిబిఐ విచారణతో జగన్‌కు టెన్షన్

ప్రజాశక్తి-కడప అర్బన్

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిజాలు తేల్చేందుకు సిబిఐ దూకుడు పెంచడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి టెన్షన్ పట్టుకుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ అవినాష్‌రెడ్డిని సిబిఐ విచారించినప్పటి నుంచి రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసారని చెప్పారు. హత్యా రాజకీయాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ముఖ్యమంత్రి జగన్ మళ్ళీ రాజధాని ప్రస్తావన విశాఖకు మార్పు అంటున్నారని విమర్శించారు. రాజధాని అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాజధాని విశాఖకు మారుస్తానని జగన్ చెప్పడం ఆయన నియంత పాలనకు నిదర్శనమన్నారు. రాజధాని అమరావతిని కాదని, విశాఖను చేయడం జగన్‌కు చేత అవుతుందా అని ప్రశ్నించారు. ఆయన పార్టీలోనే గందరగోళ పరిస్థితి నెలకొందని, ఆ పార్టీ శాసనసభ్యులు వెళ్లిపోవడానికి సిద్ధపడ్డారంటే నాయకత్వం ఎలా ఉందో అర్థం అవుతుంది అన్నారు. ఒక్క అవకాశం అంటే ప్రజలు ఇచ్చిన అవకాశ పుణ్యకాలం ముగిసిపోయిందని, ఉన్న కాస్త కాలంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై జగన్ దృష్టి సారించాలని హిత బోధ చేశారు. వై ఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన నిందితులు తప్పించు కోలేరని సిబిఐ విచారణలో నిజాలు బయటికి వస్తాయని ఆయన చెప్పారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ చిన్నాన్న హత్య కేసులో ఎవరెవరి హస్తముందో జగన్‌కు ఎరుకే అన్నారు. కేసు నుండి కడిగిన ఆణిముత్యంలో అవినాష్‌రెడ్డి బయటికి వస్తారని అంటున్న వైసిపి నేతలకు హత్య చేసింది ఎవరో తెలిసే అంటున్నారని చెప్పారు హత్య చేసి తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-కడప

బాల్య వివాహాలను నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఎం.ఎన్.రాణి అన్నారు. గురువారం కలెక్టర్లను డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా క్రిస్టియన్ మత పెద్దలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలలో గాని, పట్టణ స్థాయిలలో గాని ప్రభుత్వ అధికారులు అవగాహన కార్యక్రమాలు చెప్పినప్పటికీ ఇంకా బాల్యవివాహాలు జరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు పూర్తయి ఉండాలని చెప్పారు. మైనార్టీ కార్పొరేషన్ ఇడి వి.బ్రహ్మయ్య మాట్లాడుతూ ఆడ పిల్లల నిష్పత్తి మగ పిల్లల నిష్పత్తి కన్నా తక్కువగా ఉండడం వలన సమాజ మనుగడకే ప్రమాదమన్నారు. కార్యక్రమంలో డిసిపియు సిబ్బంది జి.సునీత, పి.ఆర్.సునీత రాజు, జి.మహేశ్వర, బి.వినోద్ కుమార్, వై.విజయ కుమారి, బి.ప్రసన్న, కె.యునుష్ బాష, ఆర్.గోవింద రాజు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని రాజుపాలెం, బ్రాహ్మణపల్లి, మల్లువారిపల్లి, చెన్నుపల్లె, గ్రామాలలో ప్రజలకు అన్ని విధాలుగా మెరుగైన సౌకర్యం, సేవలు అందిస్తామని వైస్ ఎంపిపి భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న గ్రామాలలో తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అల్లా ప్రకాష్ మాట్లాడుతూ రాజుపాలెం ఎస్సీ కాలనీ, బ్రాహ్మణపల్లిలో సుమారు రూ.15 లక్షలతో తాగునీటి కోసం, ఇంటింటి కొళాయి, పైప్ లైన్, బోర్లు, మోటర్ పంప్ సెట్లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

గాయత్రి ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కాశినాయన

పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేసిన గాయత్రి ట్రస్ట్ సేవలు చాలా అభినందనీయమని కస్తూర్బా ప్రిన్సిపల్ మెర్సీ రాణి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వరికుంట్ల కస్తూర్బా పాఠశాలలోని 36 మంది విద్యార్థినులకు ఆ ట్రస్ట్ చైర్మన్ నిగినే వెంకటేశ్వర్లు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఉప కార్యదర్శి శివానందరెడ్డి, సభ్యులు సుబ్బయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

భవిత కేంద్రానికి క్యారమ్ బోర్డులు అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప పట్టణానికి చెందిన నెహ్రూ యువ కేంద్రం సహకారంతో స్థానిక ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం హౌసింగ్ బోర్డ్‌లో ఉన్న భవిత కేంద్రానికి క్యారమ్ బోర్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ భవిత కేంద్రంలోని చెవిటి, మూగ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తూ నెహ్రూ యువ కేంద్రం సహకారంతో క్యారమ్ బోర్డులు అందజేశామన్నారు. ఆదరణ సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భవిత కేంద్ర నిర్వాహకురాలు సంగీత, ప్రేమ, ఆదరణ స్వచ్ఛంద ఉపాధ్యక్షుడు అమరావతి శ్రీనివాసులు, సభ్యుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.


క్యారమ్ బోర్డును అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఇటుక బట్టీలోకి నీళ్లు మళ్లింపుతో నష్టం

ప్రజాశక్తి -ఖాజీపేట

మండలంలోని పత్తూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ సర్పంచు పిచ్చినాయుడు ఇటుక బట్టీలోకి నీళ్లు మళ్లించడంతో దాదాపు రూ.10లక్షల మేర నష్టం వాటిల్లింది. గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు కొందరు తయారీకి సిద్ధంగా ఉన్న ఇటుకల్లోకి నీటిని మళ్లించడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిలినట్టు బాధితుడు పిచ్చినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారపార్టీ వ్యక్తులే ఈ పని చేసి ఉంటారని బాధితుడు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పిచ్చినాయుడు తెలిపారు. ఇటుకల బట్టీని టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాయకులు హబీబ్, ఐ టిడిపి మండల అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు రామసుబ్బయ్య పాల్గొన్నారు.


నీళ్లు చేరిన ఇటుక బట్టీని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

పంట నమోదు తప్పనిసరి : ఎడిఎ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పంట నమోదు తప్పనిసరి అని ఎడిఎ సురేష్‌రెడ్డి సూచించారు. పంట నమోదులో భాగంగా సూపర్ చెక్ ప్రక్రియను మండలంలోని కామనూరు, బొల్లవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పంట నమోదు జాబితాలోని వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. అనంతరం ఎడిఎ మాట్లాడుతూ పంట నమోదు చేయించుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్పుట్ సబ్సిడీ, రాయితీపై ఎరువులు, విత్తనాలు, రైతు భరోసాకు అర్హత పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎఒ శివశంకర్‌రెడ్డి, విఎఎలు కమలి, శివశంకర్, రైతులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న ఎడిఎ సురేశ్‌రెడ్డి

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లకు ఎమ్మెల్యే రాచమల్లు శివచంద్రారెడ్డి సూచించారు. స్థానిక శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో గురువారం వారికి నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలకిచ్చిన హామీలను ఎండగడుతూ జగనన్న పాలనలో జరిగిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. అంతా జగనన్న కుటుంబంలో పనిచేయాలని సూచించారు. ఐప్యాక్ టీం అవినాష్ వారికి విషయాలు వివరించారు. అనంతరం జగనన్న కిట్లను ఆయా గ్రామాల కన్వీనర్లకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ రాజారామ్ రెడ్డి, జడ్పి వైస్ చైర్మన్ జ్యేష్టాది శారద, జిల్లా ప్రచార కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఎంపిపి సానబోయిన శేఖర్ యాదవ్, ఉప మండల అధ్యక్షుడు ఆసం దస్తగిరిరెడ్డి, మండల కన్వీనర్ మార్తల ఓబుల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.


ప్రచార కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి : సిఐ


ప్రజాశక్తి - వేంపల్లె

దొంగతనాలు నివారించేందుకు స్వర్ణకారులు అందరూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సిఐ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం సాయంత్రం సిసి కెమెరాలు ఏర్పాటుపై స్వర్ణకారుల దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల చోరీలు జరిగిన సమయంలో త్వరితగతిన నిందితులను పట్టుకొనేందుకు వీలు ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు కూడా తమ ఇళ్లకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొంటే బాగుంటుందని సూచించారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ కోరారు. సమావేశంలో ఎస్ఐలు తిరుపాల్‌నాయక్, రఘురాం పాల్గొన్నారు.

శరవేగంగా సినిమా షూటింగ్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విసి క్రియేషన్స్ నిర్మాణం సారథ్యంలో 'పద్మవ్యూహం చక్రధారికే తెలుసు' అనే సినిమా నిర్మాణం పులివెందుల, సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామంలో శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సందర్భంగా గురువారం వైసిపి రాష్ట్ర నాయకులు దిన్నెపాడు రవిరాజు విలేకరులతో మాట్లాడుతూ బలపనూరు వైసిపి నాయకులు వై.చంద్ర శేఖర్‌రెడ్డి పూర్తి సహకారంతో చిత్ర యూనిట్ సినిమాను 20 రోజులుపాటు పులివెందుల చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుందన్నారు. హీరో ప్రవీణ్, హీరోయిన్ శీతల్, ముఖ్య తారాగణంతో సంజయ్ బంగారపు దర్శకత్వంలో సినిమా తయారవుతోందన్నారు. కార్యక్రమంలో చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో రవిరాజు, చిత్ర యూనిట్

త్రైమాసిక పన్నులు కచ్చితంగా చెల్లించాలి

ప్రజాశక్తి - కడప

ప్రతి రవాణా వాహన యజమాని మూడు నెలలకు ఒకసారివారి వాహనాలకు సంబంధించి పన్నులు కచ్చితంగా చెల్లించాలని ఉప రవాణా కమిషనర్ ఇ.మీరా ప్రసాద్ పేర్కొన్నారు. పన్నులు చెల్లించకుండా తిరిగే వాహనాల తనిఖీలో భాగంగా గురువారం కడప, వల్లూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, ముద్దనూరు మండలాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖకు పన్నులు చెల్లించకుండా తిరిగే వాహనముల తనిఖీ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలను ఏడు రూట్లుగా విభజించి, మూడు ప్రత్యేక బృందాలతో ప్రతిరోజు తనిఖీలు నిర్వహించేలా రవాణా శాఖ కార్యాచరణ రూపొందించిందన్నారు. ఇందులో భాగంగానే గురువారం తనిఖీలు నిర్వహించి 67 కేసులు నమోదు చేశామన్నారు. వారి నుండి మొత్తం రూ.10.80 లక్షల జరిమానా వసూలు చేశామన్నారు. వాహన యజమానులు ఈ విషయాన్ని గుర్తుంచుకొని సకాలంలో పన్నులు చెల్లించాలని ఆయన సూచించారు.

నిర్మాణంలో రాజకోట-తవ్వారిపల్లె రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రాజకొటాలు రోడ్డు నుంచి ఖాజీపేట మండలం తవ్వారుపల్లె వరకు రూ.4.65 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా కేసీ కెనాల్ కాలువ వెంబడి ఉన్న గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చేపట్టారు.13 కిలోమీటర్లకుగాను రూ.4.65 కోట్లు నిధులు ఖర్చు చేయనున్నారు. ఈ మార్గంలో రాజకోట, విజయనగరం, ఓబుల్‌రెడ్డిపేట, గాంధీనగర్ గ్రామాలున్నాయి. వీటితో పాటు ఖాజీపేట మండల పరిధిలో శాంతినగర్, తుడుమలదిన్నె, తవ్వారుపల్లె గ్రామాలున్నాయి. గతంలో ఈ మార్గాన కేసీ కెనాల్ కాలువ వెంబడి గ్రావెల్ రోడ్డు గుంతలమయంగా ఉండేది. ప్రజలు నానా అవస్థలు పడుతూ మైదుకూరు, ఖాజీపేట పట్టణాలకు ప్రయాణించేవారు. ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు ప్రయాణం సుఖవంతంగా ఉంటుంది. మండల పరిధిలో ఇప్పటికే చింతకుంట-చియ్యపాడు, రామసుబ్బమ్మ కొట్టాలు-వెదురూరు రహదారిని కూడా నూతనంగా నిర్మించారు. ఈ రోడ్ల పనులు పూర్తి కావడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి.


గాంధీనగరం వద్ద గ్రావెల్ పనుల వరకు పూర్తయిన రోడ్డు

నేడు సిఎస్ రాక.. ఏర్పాట్ల పరిశీలన


అధికారులకు, సిబ్బందికి సూచనలు చేస్తున్న జెసి, ఎస్పి


ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ముద్దనూరుకు రానున్నారు. సిఎస్ విద్యను అభ్యసించిన స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించనున్నారు. పాఠశాలలో నాబార్డు, మనబడి, నాడు-నేడు ద్వారా నిర్మిస్తున్న నూతన భవనాలు, తరగతి గదుల మరమ్మతులు, ఆవరణలో చేపట్టిన మొక్కల పెంపకాన్ని ఆయన పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జెసి సాయికాంత్ వర్మ పాఠశాలలో జరుగుతున్న పనులను, ఏర్పాట్లను పరిశీలించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ఎస్పి కెకె అన్బురాజన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డిఒ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ రమణారెడ్డి, ఎంఇఒ విజయభాస్కర్‌రెడ్డి, డిటి సుధీర్ యాదవ్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలి

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పి అన్బురాజన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పెద్దముడియం మండలానికి సంబంధించిన బాధితులు ఒకేసుపై సమస్యను ఎస్‌పికి విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతలకు రక్షణ కల్పించాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ అధికారుల సమన్వయంతో నాటుసారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులు ముమ్మరం చేయాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా పచ్చదనం పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సర్పంచు రెడ్యం నాగవేణి దంపతులు

ప్రజాశక్తి - ఖాజీపేట

తమ ప్రభుత్వంలో అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని దుంపలగట్టులో గురువారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రతి ఇంటికి వెళుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా భావిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైపిపికే ప్రజలు పట్టం కట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, సర్పంచు రెడ్యం నాగవేణి, రెడ్యం రామకృష్ణారెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, ఎంపిపి సిద్ధిక్, ఎంపిటిసి చంద్రశేఖర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, తవ్వా కిషోర్‌కుమార్‌రెడ్డి, అంబటి శివారెడ్డి, కొత్తపేట గోపాల్‌రెడ్డి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ముద్దనూరు : ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ముద్దనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నారెడ్డిపల్లెలో గురువారం మాజీ ఎంపిపి మునిరాజారెడ్డితో కలిసి ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సచివాలయ పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిటి సుధీర్ యాదవ్, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సుమంత్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఫ్లయాష్ వల్ల ప్రజలకు కష్టాలు : భూపేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపి నుండి టిప్పర్ల ద్వారా తరలిస్తున్న ఫ్లయాష్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్లయాష్‌ను సిమెంట్ పరిశ్రమలకు ఇటుక బట్టీలకు తరలిస్తున్నారన్నారు. ఈ క్రమంలో రోడ్ల వెంబడి పడుతున్న ఫ్లయాష్ వల్ల గ్రామాలలోని ప్రజలకు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. మండలంలోని కలమల్ల, మాలపాడు, వెంకటాపురం, పోట్లదుర్తి, చిలంకూరు, నిడుజీవి, ఎర్రగుంట్ల ప్రాంతాల ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రజలు పలుసార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ధర్నాలు చేస్తున్నా అధికారులు మౌనం వహించడమేంటని ఆయన ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు లోబడే ఫ్లయాష్ తరలింపు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. లేదంటే టిడిపి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు : డిఎస్‌పి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట శివారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో బుధవారం రాత్రి జరిగిన హత్య కేసును వన్ టౌన్ పోలీసులు ఛేదించారని, ముగ్గురు నిందితులను గురువారం రైల్వే బ్రిడ్జి సమీపంలో అరెస్టు చేశారని డిఎస్‌పి వెంకటశివారెడ్డి తెలిపారు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్నేహితుల మధ్య చిన్న చిన్న గొడవలు హత్యకు దారితీశాయని తెలిపారు. నిందితులు గంగాధర్, రాఘవ, ఖాదరవల్లి రేవంత్ అభిలాషను పిడిబాకులతో పొడిచి హత్య చేశారని ఆయన పేర్కొన్నారు. నిందితుల నుండి రెండు పిడిబాకులు, మోటర్ సైకిల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. వీరిని కోర్టుకు హాజరుపరుస్తున్నామని డిఎస్‌పి తెలిపారు. విలేకరుల సమావేశంలో వన్ టౌన్ సిఐ నాగరాజు, ఎస్ఐ పెద్ద ఓబన్న, పోలీసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లి క్రాస్ రోడ్డు నుంచి ప్రొద్దుటూరు వైపునకు పోతున్న వ్యక్తిని గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో గుర్తు తెలియని ఆ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మతుడి ఒంటిపై పెయింటింగ్ వేసేటప్పుడు వేసుకొనే ప్యాంటు ధరించిఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిస్తే ప్రొద్దుటూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో తెలియజేయలని ఎస్ఐ కోరారు.

వృద్ధులకు ఉచితంగా కట్టుడు పళ్ల సెట్లు


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేఖ

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ఆసుపత్రిలో కట్టుడు పళ్ల విభాగంలో జనవరి 22న ప్రపంచ ప్రోస్తో డెంటిస్ట్ డే పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలను నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేఖ పేర్కొన్నారు. వాటికి ముగింపుగా గురువారం దంత వైద్య కళాశాలలో ఘనంగా నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా ఫిక్షణరి, సోప్ కార్వింగ్, పేష్ పెయింటింగ్, రాంగోలి పోటీలను కళాశాల విద్యార్థులకు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది వృద్ధులకు ఉచితంగా ఒకే రోజున కట్టుడు పళ్ళ సెట్లను అమార్చామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేఖ ఆ విభాగంలో అందించు సేవలను, ఆధునిక చికిత్సలను, అభినందించారు. విభాగాధిపతి డాక్టర్ డి.సుధామాధురి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో బ్లాక్ ఫంగస్ రోగులకు కోల్పోయిన అవయవ భాగాలను, కృత్తిమ భాగాలతో అమర్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, పీజీ స్టూడెంట్స్, పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు

రాజంపేట అర్బన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎకనామిక్స్ ఒక పోస్టు ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో పాసై ఉండాలని, నెట్, సెట్, పిహెచ్‌డి కలిగి ఉండి బోధనలో అనుభవం గలవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 6వ తేదీ ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

చిరుధాన్యాలతో అదనపు దిగుబడి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

చిరుధాన్యాల సాగుతో అదనపను దిగుబడి సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య సూచించారు. మండల పరిధిలోని చిన్న దండ్లూరు గ్రామంలో గురువారం జిల్లా వనరుల కేంద్ర బృందం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, అరికెలు వంటి పంటలను సాగు చేసి తక్కువ ఖర్చుతో అదనపు దిగుబడి సాధించవచ్చునని వివరించారు. వరి, శనగ, తెల్ల కుసుమ వంటి ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సంబంధించి తగు సూచనలు చేశారు. రసాయనిక పురుగు మందులు, ఎరువుల వినియోగం తగ్గించి ఆరోగ్యమైన పంట ఉత్పత్తులను పండించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రమణారెడ్డి రైతులను కోరారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పద్మజ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎఒ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రీలత, రైతులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తూ రైతులకు సూచనలుస్తున్న అధికారులు

నేటి నుంచి రామాలయం ప్రతిష్ఠ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని విశ్వనాథపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ గణపతి సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రుల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా రోజుల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

వధూవరులను ఆశీర్వదించిన వైఎస్ సోదరులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్ సోదరుడు కిరణ్, కృష్ణవేణి నూతన వధూవరులను గురువారం పులివెందుల నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, పురపాలక వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆశీర్వదించారు. స్థానిక ఎస్‌సి ఎస్ఆర్ కళ్యాణ మండపంలో గురువారం కిరణ్, కృష్ణవేణి వివాహం జరిగింది. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, వైసిపి నాయకులు అంబకపల్లి బాబురెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, పురపాలక సిబ్బంది, కౌన్సిలర్లు, నూతన వధూవరులను ఆశీర్వదించారు.


వివాహ వేడుకల్లో వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి

అందరూ సంతోషంగా ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అందరూ సంతోషంగా ఉండాలన్నదే ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయ ఆశయమని ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఓంశాంతి భవన్‌లో గురువారం ముందస్తు శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. 87వ త్రిమూర్తి శివ జయంతి ఓశాంతి నిర్వహకులు బ్రహ్మ కుమారీలు విజయ త్రివేణి, సౌమ్య ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో బైకు ర్యాలీ నిర్వహించారు. బైకు ర్యాలీని ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, ఆర్యవైశ్య అధ్యక్షుడు వడ్లకుంట రాజరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఓశాంతి భవన్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, రాయచోటి ఓశాంతి నిర్వహకులు బ్రహ్మ కుమారి హరతి, ఆర్యవైశ్య యువజన నాయకులు పాల్గొన్నారు.


వేంపల్లెలో బైకు ర్యాలీ చేస్తున్న ఆర్యవైశ్యులు

అన్నదానం భాగ్యంగా భావించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అనాథ వృద్ధులకు అన్నదానం చేయడం భాగ్యంగా భావించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదార్ థెరిస్సా వృథాశ్రమంలో గురువారం తులసిరెడ్డి సమీప బంధువు కెబి గణేషన్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ద్వారా అనాథ వృద్ధులకు పౌష్టికాహారం అందించే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, కుమార్తె మాధురిరెడ్డి, కుసుమ, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య, శివపార్వతి, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, అమర్, చెన్నకేశవ, శివయ్య పాల్గొన్నారు.


వృద్ధులకు అన్నదానం చేస్తున్న తులసిరెడ్డి కుటుంబ సభ్యులు

కుష్టు రోగులను ఆదరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కుష్టు రోగులను ఆదరించాలని 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి సూచించారు. ఆజాదికా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆ వ్యాధిపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని గురు వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. వైయంఆర్ కాలనీ, సాయికుటీర్ రోడ్డు, లేపాక్షి డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేశారు. యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ చర్మంపై పాలి పోయిన రాగి రంగులో పొడలు, మచ్చలు, మచ్చలపై స్పర్శలేక పోవడం, మచ్చలపై చమట పట్టకపోవడంవంటి లక్షణాలు ఉన్న వారు దగ్గర లోని ఆరోగ్యకేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సి పల్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అవగాహనా కార్యక్రమాల ద్వారా వ్యాధిని దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సిఒ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రస్థాయి పోటీలో తమ విద్యార్థులు మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.వి.ఎస్.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత బాలుర విభాగంలో జమ్మలమడుగు విద్యార్థులు డిస్కస్ త్రోలో రాష్ట్రస్థాయిలో ఒకటవ స్థానంలో యం. సుబ్బరాయుడు, జావెలిన్ త్రోలో రాష్ట్రస్థాయి మూడవ స్థానంలో బి.వంశీకృష్ణ, చెస్‌లో సెకండ్ ప్లేస్‌లో కమలాపురం విద్యార్థి నిలిచారన్నారు. సింహాచలంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులైన రవి కేశవ, సునీత, మధు, సుజాత, శైలజ కూడా అభినందించారు.


విద్యార్థులతో ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు



బిజెపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయ్ : పిసిసి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బిజెపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయని పిసిసి కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్బి అతిథి గృహంలో హాథ్సే హాథ్ జోడో అభియాన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా చేతుల్లో నుంచి కాపాడానికే రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేపట్టారన్నారు. జోడో యాత్ర విజవంతం అవ్వడంతో మోదీ, అమిత్షాలకు కంటి మీద కునుకు లేకుండా పోయిందన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువులు ధరలు పెరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పాండురంగయ్య, మండల అధ్యక్షులు లేబాకు రవి, పట్టణ అధ్యక్షులు షైక్ మహమ్మద్, కాంగ్రెస్ పార్టీ నందలూరు అధ్యక్షులు సుబ్బరాయుడు, నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్రం ఎప్పటి మాదిరిగానే 2023-24 బడ్జెట్లోనూ ఆంధ్రప్రదేశ్కు అన్యాయం చేసిందని, రాష్ట్ర ప్రజల హక్కు అయిన ప్రత్యేక హోదాకు మొండిచేయి చూపించి బిజెపి ద్రోహం చేస్తున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం మదనపల్లె మార్కెట్ యార్డు ఎదురుగా కదిరి రోడ్డు మీద సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ను నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి డౌన్ డౌన్, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలి, కడప-బెంగళూరు రైల్వేలైన్కు నిధులు కేటాయించాలి, రాష్ట్రానికి నిధులు పెంచాలని అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాధ్యత తన మొసలి కన్నీరు కార్చిన ప్రధాని గత ఎనిమిది సంవత్సరాలుగా ద్రోహం చేస్తూనే వచ్చారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని అదానికి బిజెపి తాకట్టుపెట్టిందని అన్నారు. కేంద్ర బడ్జెట్లో ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటి ఊసెత్తకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, అన్నమయ్య జిల్లా వంటి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మొత్తం 62 పేజీల బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ఆంధ్రప్రదేశ్ అన్నమాటనే ఉచ్ఛరించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కర్ణాటకు కొత్తగా ప్రత్యేక కేటాయింపులు చేసిన కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాజధాని అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, కడప బెంగళూరు రైల్వేలైన్కు మొండిచేయి చూపిందని విమర్శించారు. ఉపాధి హామీ కేటాయింపుల్లో సగం కోతపెట్టడం, ఆహారం, ఎరువులపై సబ్సిడీలను ఘోరంగా కుదించడం వల్ల సామాన్యులు తీవ్ర ఇక్కట్ల పాలవుతారని ఆవేదన చెందారు. విద్యుత్ సంస్కరణలు, పట్టణాల్లో యూజర్ ఛార్జీల వంటివి జనం నడ్డి విరుస్తాయని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి నామమాత్రపు కేటాయింపులు చేసిందని తెలిపారు. రాష్ట్రానికి తీవ్ర నిరాశకలిగించిన కేంద్ర బడ్జెట్ను రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం వ్యతిరేకించాలని కోరారు. సిపియం పట్టణ కార్యదర్శి డి. ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు నాగరాజు, సురేంద్ర, వెంకటేష్, రమణ, కందస్వామి తదితరులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పట్టణంలోని గాంధీజీ విగ్రహం ఎదుట సిఐటియు, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం కేంద్ర బడ్జెట్ బిల్లుకు నిరసన తెలిపి బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సి.రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులను నిరాశపరిచే విధంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం చాలా దుర్మార్గమన్నారు. పేద, మధ్య తరగతి వారికి ఈ బడ్జెట్ నిరాశ పరిచిందన్నారు. కార్యక్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లికాలమ్మని, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ పెంచలయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, కార్తీక్, ఉపేంద్ర, అఖిల్, వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు శంకర్, మణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి పాల్గొన్నారు.



మదనపల్లె: రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు



రాజంపేట : జిఐ ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

జగనన్న కాలనీలకు విద్యుత్ సరఫరా

- ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ సంతోష్రావు

ప్రజాశక్తి - కడప

జగనన్న కాలనీలలో పూర్తయిన ఇండ్లకు వెంటనే విద్యుత్ మీటర్ బిగించి విద్యుత్ సరఫరా చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్రావు ఆదేశించారు. గురువారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటే దేశం బాగుంటుందని తెలిపారు. రైతులు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసు కొరకు దరఖాస్తు చేసుకొని అవసరమైన రుసుం చెల్లించిన వెంటనే జాప్యం లేకుండా సర్వీసులు విడుదల చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు తమ పనితీరును మెరుగు పరుచుకోకపోతె చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగులలో మార్పు కోసం అనేక అవకాశాలు ఇచ్చాం, ఇప్పటికి మారని వారిపై చర్యలు తప్పవు, ఒకసారి చర్యలు తీసుకుంటే వెనక్కి తీసుకునేది ఉండదని హెచ్చరించారు. ప్రమాణాల ప్రకారం వినియోగదారుల విద్యుత్తు సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన నిరంతర 24 గంటల విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఒఎస్డి శ్రీనివాసులు, చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.మునిశంకరయ్య, కడప, అన్నమయ్య జిల్లాల సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జె.చిన్న రాఘవులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిఇలు, ఎఇలు, అకౌంట్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్రావు

పకడ్బందీగా భూముల రీ సర్వే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే పకడ్బందీగా జరగాలని అధికారులను చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్రెడ్డి అన్నారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్, సీరికల్చర్, అనిమల్ హస్బండ్రీ, హౌసింగ్, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్ గిరీష్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్రెడ్డి మాట్లాడుతూ కీలకమైన డ్రోన్ సర్వే, ఆ తర్వాత దశల్లో జరిగే క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ, గ్రౌండ్ వాలిడేషన్ వంటి పనులన్నీ చకచకా ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. మొదటి దశలో రెండువేల గ్రామాలలో, రెండవ దశలో రెండు వేల గ్రామాలలో రీ సర్వే చేపట్టామన్నారు. మొదటి దశ, రెండవ దశ ప్రగతిలపై ఆయన సమీక్షించారు. గ్రౌండ్ ట్రూతింగ్, డ్రోన్ సర్వే, మ్యుటేషన్స్ తదితర అంశాలలో లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మొదటి పేజ్లో కరెక్షన్స్, రిజిస్ట్రేషన్ లు ఫిబ్రవరి 16కల్లా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర రహదారుల ప్రాధాన్యతను గుర్తించాలని, భూసేకరణ వేగవంతానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా రివ్యూ చేసి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రబీ ఈక్రాప్ బుకింగ్ గడువులోగా పూర్తి చేయాలన్నారు. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం గ్రౌండింగ్ వేగవంతం చేయాలన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించి వాటి సాగును ప్రోత్సహించేలా రైతులకు సూచనలు, సలహాలు క్షేత్రస్థాయిలో అందివ్వాలని తెలిపారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని, రోజువారీ ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక రోగాలును అరికట్టవచ్చని చెప్పారు. పల్లెల్లో పాల వెల్లువ పరిఢవిల్లేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, నాణ్యమైన పాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు (బీఎంసీయూ), ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల(ఏఎంసీయూ)ను ఏర్పాటు చేస్తోంది. బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ ల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పూర్తిపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్టేజ్ కన్వర్షన్ మీద ఫోటోస్ పెట్టాలని సూచించారు. ఇంకా వివిధ ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చీఫ్ సెక్రటరీ జిల్లాల కలెక్టర్లు, జెసిలు, జిల్లా అధికారులకు దిశ నిర్దేశించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ గిరీష మాట్లాడుతూ మత్స్య సంపద యువతలో స్వయం ఉపాధి కోసం ఫిష్ ఆంధ్ర మినీ ఫిష్ రిటైల్ ఔట్లెట్లు ప్రతి మండలంలో ఒకటి చొప్పున ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిఆర్డిఎ పీడీని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఫైనల్ ఆర్ఓఆర్, తదితర కార్యక్రమాలను వేగవంతం చేయాలని, రీ సర్వేలో ఆయా దశలలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రబీ సీజన్ ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సూచించారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

'విదేశీ విద్యాదీవెన పేద విద్యార్థులకు వరం'

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న విదేశీ విద్యాదీవెన పేద విద్యార్థులకు వరం లాంటిదని సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గిరిష, సోషల్ వెల్ఫేర్ డిడి జాకీర్ హుస్సేన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్బలాం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి నేటి నుంచి అర్హులైన విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన నిధులను విడుదల చేస్తామన్నారు. ఇతర దేశాలలోని యూనివర్సిటీలలో చదువుతున్న విద్యార్థులకు నిధులు జమ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం మొట్ట మొదటి సారిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులు విదేశాలలో ఎంబిబిఎస్ విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాలలో ఎంపికైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ గిరిష మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేటట్లు చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమం పేద విద్యార్థులకు వరం లాంటిదన్నారు. మొట్టమొదటిసారిగా నిర్వహించే జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమం గురించి ప్రతి విద్యార్థికి అవగాహన ఉండేటట్టు చూడాలన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెనకు ఎంపికైన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనేటట్లు చూడాలని అధికారులకు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్రెడ్డి

భూ పంపిణీ పేరుతో అక్రమాలు : ఆర్ఆర్

ప్రజాశక్తి-రాయచోటి

భూ పంపిణీ కార్యక్రమం పేరుతో వైసిపి నాయకులు అక్రమాలు అక్రమాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపిలో కొంత మంది నాయకులు కొత్త రేషన్ కార్డులు సాగుతో తండ్రికి భూమి ఉన్న కూడా కొడుకుకు భూమి లేదని స్వాగతం భూ పంపిణీ కార్యక్రమంలో కొత్త రేషన్ కార్డులు ఏర్పాటు చేసుకొని భూ పంపిణీ కార్యక్రమం పాల్పడుతున్నారని ఆరోపించారు. గ్రామాలలో నిజమైన నిరుపేదలు ఉంటే వారి వారికి భూ పంపిణీ చేస్తున్న వారి లిస్టు సచివాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలో వందల ఎకరాలు కబ్జాలు చేసేదానికి వైసిపి నాయకులు పంతం పట్టుకొని పనిచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు అర్హులైన నిరుపేదలకు భూపబలి కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు అక్రమాలు జరగకుండా హుందాగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని రాబోయేది తమ ప్రభుత్వం మే అని అప్పుడు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. అనంతరం విలేకరులు 2024లో ఎమ్మెల్యే టికెట్ ఎవరికి వస్తుందని అడగగా ఇప్పటివరకు తన నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జిగా ఉన్నానని తన పోటీలో ఉంటానని ధీమా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజులు ఖాదర్ బాషా, మాజీ జడ్పిటిసి నర్సారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుల మురికి నాటి వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్లు భాషా, బసవయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ కేలండర్ ఆవిష్కరణ

రాయచోటి: వ్యవసాయ శాఖ కేలండర్ను గురువారం కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు నవీన్ కుమార్, సెక్రెటరీ రమేష్ బాబురావు, కోశాధికారి వెంకట్ మోహన్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ కేలండర్ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష

కలకలం రేపిన గురుకుల పాఠశాల విద్యార్థుల పరారీ

- పాఠశాలకు వద్దకు బారులు తీరిన తల్లిదండ్రులు

- విద్యార్థులను తిరిగి పాఠశాలకు తీసుకొచ్చిన పోలీసులు

- ఊపిరి పీల్చుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బి.కొత్తకోట: మండలంలోని మల్లెల సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు గోడ దూకి పరారయ్యారు. గురువారం ఉదయం నుంచి విద్యార్థులు కనబడటం లేదనే విషయయాన్ని ప్రిన్సిపల్ పోలీసులకు తెలియజేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పరారైన విద్యార్థుల కోసం రెవెన్యూ, పోలీసు యంత్రాంగం గాలింపు చేపట్టారు. విద్యార్థులు పరారైన విషయాన్ని తెలుసుకొని కళాశాల వద్దకు తల్లిదండ్రులు బారులు తీరారు. చివరకు పరారైన విద్యార్థులు పట్టణంలోని ఒక కళాశాల వద్ద ఉన్నారని గుర్తించి పోలీసులు వారిని పాఠశాలకు తీసుకొచ్చారు. విద్యార్థులు ఏ కారణం చేత పరారయ్యారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు మదనపల్లి డిఎస్పి కేశప్ప, ఆర్డిఒ మురళి పేర్కొన్నారు. విద్యార్థులు ఇలా పరారు కావడం మంచిది కాదని, ఏదైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. విద్యార్థులు తిరిగి పాఠశాలకు చేరుకోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో సిఐ శివాంజనేయులు, బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్, పెద్దతిప్పసముద్రం ఎస్ఐ మధు రామచంద్రుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో జనసేన గెలుపే లక్ష్యం

రాజంపేట అర్బన్: రానున్న 2024 ఎన్నికల్లో జనసేన గెలుపే లక్ష్యమని, గ్రామ గ్రామాన పార్టీని మరింత బలోపేతం చేస్తామని రాజంపేట జనసేన పార్టీ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని కూచివారిపల్లె పంచాయతీలోని పలు గ్రామాలలో జనసేన నాయకులు పవనన్న ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ రూపొందించిన సిద్ధాంతాలు, ఆశయాలు, హామీలతో కూడుకున్న కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, జనసేన నాయకులు తాళ్లపాక శంకరయ్య, పోలిశెట్టి శ్రీనివాసులు, జనసేన వీర మహిళలు జెడ్డా శిరీష, మాధవి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

కలసపాడు: మండలంలోని రాజుపాలెం, బ్రాహ్మణపల్లి, మల్లువారిపల్లి, చెన్నుపల్లె, గ్రామాలలో ప్రజలకు అన్ని విధాలుగా మెరుగైన సౌకర్యం, సేవలు అందిస్తామని వైస్ ఎంపిపి భాస్కర్రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న గ్రామాలలో తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డబ్ల్యుఎస్ ఎఇ అల్లా ప్రకాష్ మాట్లాడుతూ రాజుపాలెం ఎస్సీ కాలనీ, బ్రాహ్మణపల్లిలో సుమారు రూ.15 లక్షలతో తాగునీటి కోసం, ఇంటింటి కొళాయి, పైప్ లైన్, బోర్లు, మోటర్ పంప్ సెట్లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎకనామిక్స్ ఒక పోస్టు ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు పోస్ట్ గ్రాడ్యుయేషన్లో 55 శాతం మార్కులతో పాసై ఉండాలని, నెట్, సెట్, పిహెచ్డి కలిగి ఉండి బోధనలో అనుభవం గలవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

సిబిఐ విచారణతో జగన్కు టెన్షన్


టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిజాలు తేల్చేందుకు సిబిఐ దూకుడు పెంచడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి టెన్షన్ పట్టుకుందని టిడిపి పొలిట్బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం గాయత్రీ టవర్స్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ అవినాష్రెడ్డిని సిబిఐ విచారించినప్పటి నుంచి రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసారని చెప్పారు. హత్యా రాజకీయాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ముఖ్యమంత్రి జగన్ మళ్ళీ రాజధాని ప్రస్తావన విశాఖకు మార్పు అంటున్నారని విమర్శించారు. రాజధాని అంశం సుప్రీంకోర్టులో పెండింగ్లో ఉన్నప్పటికీ రాజధాని విశాఖకు మారుస్తానని జగన్ చెప్పడం ఆయన నియంత పాలనకు నిదర్శనమన్నారు. రాజధాని అమరావతిని కాదని, విశాఖను చేయడం జగన్కు చేత అవుతుందా అని ప్రశ్నించారు. ఆయన పార్టీలోనే గందరగోళ పరిస్థితి నెలకొందని, ఆ పార్టీ శాసనసభ్యులు వెళ్లిపోవడానికి సిద్ధపడ్డారంటే నాయకత్వం ఎలా ఉందో అర్థం అవుతుంది అన్నారు. ఒక్క అవకాశం అంటే ప్రజలు ఇచ్చిన అవకాశ పుణ్యకాలం ముగిసిపోయిందని, ఉన్న కాస్త కాలంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై జగన్ దృష్టి సారించాలని హిత బోధ చేశారు. వై ఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన నిందితులు తప్పించుకోలేరని సిబిఐ విచారణలో నిజాలు బయటికి వస్తాయని ఆయన చెప్పారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ చిన్నాన్న హత్య కేసులో ఎవరెవరి హస్తముందో జగన్కు ఎరుకే అన్నారు. కేసు నుండి కడిగిన ఆణిముత్యంలో అవినాష్రెడ్డి బయటికి వస్తారని అంటున్న వైసిపి నేతలకు హత్య చేసింది ఎవరో తెలిసే అంటున్నారని చెప్పారు హత్య చేసి తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి



డ్రైవర్ కె.ఎం.బాషాను సన్మానిస్తున్న అధికారులు

ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకం

ఆర్టిసి ఇడి గోపీనాథ్రెడ్డి

ఉత్తమ డ్రైవర్లకు మెమోంటో, ప్రశంసాపత్రాలు

కడప అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకమని ఇడి గోపీనాథ్రెడ్డి అన్నారు. గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆర్టీసీ సమావేశ మందిరంలో ఉత్తమ డ్రైవర్లకు మెమోంటో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లను తీసుకునే ముందు అన్ని పరీక్షలు చేసి ఎంపిక చేస్తుందని పేర్కొన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడడం నిషేధమన్నారు. ఆరోగ్య పరీక్షలను యధావిధిగా చేయించుకోవాలని చెప్పారు. ఒత్తిడిని తగ్గించుకొని ప్రశాంతమైన డ్రైవింగ్ ను చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. డిటిసి వీరప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. వేగమే ప్రమాదానికి కారణమని చెప్పారు. రోడ్డుకు అడ్డంగా బస్సు ఆపిన సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసిన కేసు పెడతామని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ డ్రైవర్గా ఎంపికైన కె.ఎం.బాష, రీజన్, జోనల్, జిల్లా స్థాయి ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎం, డిఎం, డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

కడప: బాల్య వివాహాలను నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఎం.ఎన్.రాణి అన్నారు. గురువారం కలెక్టర్లను డిఆర్డిఎ సమావేశ మందిరంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా క్రిస్టియన్ మత పెద్దలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలలో గాని, పట్టణ స్థాయిలలో గాని ప్రభుత్వ అధికారులు అవగాహన కార్యక్రమాలు చెప్పినప్పటికీ ఇంకా బాల్యవివాహాలు జరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు పూర్తయి ఉండాలని చెప్పారు. మైనార్టీ కార్పొరేషన్ ఇడి వి.బ్రహ్మయ్య మాట్లాడుతూ ఆడ పిల్లల నిష్పత్తి మగ పిల్లల నిష్పత్తి కన్నా తక్కువగా ఉండడం వలన సమాజ మనుగడకే ప్రమాదమన్నారు. కార్యక్రమంలో డిసిపియు సిబ్బంది జి.సునీత, పి.ఆర్.సునీత రాజు, జి.మహేశ్వర, బి.వినోద్ కుమార్, వై.విజయ కుమారి, బి.ప్రసన్న, కె.యునుష్ బాష, ఆర్.గోవింద రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.ఎన్.రాణి


సాగుకు మట్టిని పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు

10న శ్రీగంధం సాగుపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

శ్రీగంధం సాగుపై నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ జ్యోత్స్న తెలిపారు. ఈనెల 10న ఇన్స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బెంగళూరు వారితో కలిసి శ్రీగంధం సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు ఇన్ శాస్త్రవేత్తలు డా. సందీప్ చక్రవర్తి, గిరిబాబు, నర్సరీ యాజమాన్యం సాగులో మెళకువలపై రైతులకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. సాగులో రైతులకు ఉన్నటువంటి సందేహాలకు సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మెరుగైన ఆదాయం పొందాలని కోరారు.

మానవత్వం చాటుకున్న వాలంటీర్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధికి పింఛన్ అందిస్తున్న వాలంటీర్

అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఓవృద్ధికి స్థానిక వాలంటీర్ పింఛన్ అందించి మానవత్వాన్ని చాటు కున్నట్లు ఎంపిడిఒ లీలామాధవి, పంచాయతీ కార్యదర్శి గిరిధర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని నిమ్మనపల్లి పంచాయతీ పెద్దహరిజనవాడకు చెందిన ఎస్.ఆదినారాయణ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్నారని అన్నారు. చిత్తూరు లోని ప్రభుత్వ ఆస్పత్రిలో నెఫ్రోజులాజీ చికిత్స తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం డయాలసిస్ రోగులకు అందిస్తున్న రూ.10వేల పింఛన్ను స్థానిక వాలంటీర్ కొమ్ము వెంకటేష్ చిత్తూరు లోని ఆస్పత్రికి వెళ్లి వారికి పింఛన్ అందించినట్లు తెలిపారు. వాలంటీర్ను పంచాయతీ కార్యదర్శి గిరిధర్ నాయక్, సచివాలయ ఉద్యోగులు మనోజ్, శ్రీకాంత్, లక్ష్మీదేవి, గాయత్రి, కుమార్ నాయక్, మహబూబ్ భాషా, రెడ్డి పావని, ఉద్యోగులు అభినందించారు.

నేలమల్లేశ్వర స్వామి ఆలయ ఇఒగా మంజుల

నిమ్మనపల్లి : మండలపరిధిలోని తవళం గ్రామంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయ ఇఒగా మంజుల గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఇఒ మునిరాజా మొగిలి దేవస్థానానికి బదిలీ కాగా, రెడ్డప్ప కొండ ఇఒ గా పనిచేస్తున్న మంజులను నేలమల్లేశ్వర స్వామి ఆలయ ఇఒగా నియమించినట్లు తెలిపారు. మండల వైసిపి ఇన్ఛార్జ్ ఆర్వి.రమణారెడ్డితో కలిసి ఆలయాన్ని వారు దర్శించారు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గంగాధర, శంకర, రవి, మహేష్ పాల్గొన్నారు.

ప్రిన్సిపల్కు సన్మానం

కంభంవారిపల్లి : మండల పరిధిలోని గ్యారంపల్లి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శివయ్య గత నెలలో పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో నూతన ప్రిన్సిపల్గా డా.మాధవరం చెన్నకేశవులు బాధ్యతలు చేపట్టారు. అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ, భూపతి, రమణయ్య, ప్రభావతి, అన్నపూర్ణ, సౌజన్య, వెంకటరమణ, హరి, వెంకటేశ్వర్లు, రమేష్, కొండయ్య, మస్తాన్వలీలు ప్రిన్సిపల్ను సన్మానించారు.

పార్టీ బలోపేతానికి కృషి

మదనపల్లె అర్బన్ : శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎస్ఎ. కరిముల్లా తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం నిర్వహించిన ముస్లిం మైనార్టీల ముఖ్య సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమైన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. డిప్యూటీ సిఎం, మైనార్టీ శాఖ మంత్రి అంజద్ బాషాను కలిసి సన్మానించినట్లు పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన సిఎం జగన్కు ధన్య వాదాలు తెలిపారు.



కుష్టు వ్యాధిపై రోగులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లోకవర్ధన్


కుష్టువ్యాధి వంశ పారంపర్యంగా రాదు

ప్రజాశక్తి-కలికిరి

కుష్టు వ్యాధి వంశ పారంపర్యముగా రాదని జిల్లా డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. గురువారం కలికిరి మండలం లోని గుండ్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా 104 సేవలకు హాజరైన ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి ఒక సూక్ష్మక్రిమి ద్వారా వస్తుందని, వంశ పారంపర్యంగా రాదని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్రఫీ మాట్లాడుతూ లక్షణాలను బట్టి వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే బహుళ ఔషధ చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. అని, స్పర్శ, నొప్పి, నవ్వా లేని మచ్చలు శరీరంలో ఎక్కడైనా ఉండవచ్చునని, పావలా, అర్ధ రూపాయి పరిమాణంలో వుంటాయని అన్నారు. ప్రభుత్వం ఈ వ్యాధికి చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తుందన్నారు. అనంతరం ప్రజలు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికుర్తి పిహెచ్సి పర్య వేక్షకులు హేమలత, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధన చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : విద్యార్థుల అభ్యసనా స్థాయిని గుర్తించి అర్థమయ్యే విధంగా, సరళంగా మెరుగైన బోధన చేయాలని ఎంఇఒ త్యాగరాజు ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం గోపిదిన్నె ఉన్నత పాఠశాల, ఉప్పూరు వాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాఠశాల నిర్వహణ విషయంలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం, జగనన్న గోరుముద్ద, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ మెనూ మేరకు విద్యార్థులకు నాణ్యమైన వంటకాలతో భోజనం వడ్డించాలన్నారు. ఈయన వెంట ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, టీచర్ ఆదినారాయణ, సిఆర్పి సుధాకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ త్యాగరాజు

ఇంటి వద్దకే పింఛన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గాలివీడు


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్రెడ్డి

గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ ఇస్తున్న ఘనత వైఎస్.జగన్మోహన్రెడ్డికే సాధ్యమైందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చివరి రోజు కొర్లకుంట , నాయనవారిపల్లి, తలముడిపి, గుడిసెలోలపల్లి, రెడ్డివారిపల్లి, కలంకపల్లి, తలముడి, పికస్పాలలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందు తున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు సచివాల యాల్లో సంప్రదించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. నవరత్నాల పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వంలో రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. వృద్ధులకు, వితంతువులకు ఒకటవ తేదీ ఉదయానే వారి ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి జల్లా సుదర్శన రెడ్డి, వైస్ ఎంపిపి మిట్టపల్లి యదు భూషన్ రెడ్డి, మైనార్టీ నాయుడు ఖాదర్ మేదీన్, సర్పంచులు జ్యోతి ఉమాపతి రెడ్డి , ఎంపిడిఒ శేఖర్ నాయక్, తహశీల్దార్ దైవాదీనం, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలుగా కలిచెర్ల బాలికలు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో జరిగిన జిల్లా కబడ్డీ పోటీల్లో మండలంలోని కలిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల జట్టు విజేతలుగా నిలిచారు. రాయచోటిలో గత నెల 30న నుండి ఈనెల 1 వ తేదీ వరకు జిల్లాస్థాయి ఛాంపియన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలము లోని కలిచెర్ల హైస్కూల్ బాలికలు జిల్లా స్థాయిలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. విద్యార్థులను పీడీ రమేష్, ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు సోమశేఖ రెడ్డి, అన్సర్, సుబ్రమణ్యం, సురేష్, రామకృష్ణ, కృష్ణవేణి, సరస్వతిలు అభినందించారు.

రన్నర్స్గా బాలుర పాఠశాల విద్యార్థులు

గాలివీడు : రాయచోటి పట్టణంలోని ఐకె ఒలంపియాడ్ పబ్లిక్ స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గాలివీడు విద్యార్థులు రన్నర్స్ గా నిలిచారని ప్రధానో పాధ్యాయులు బి.రెడ్డెన్న తెలియజేశారు. ఈ సందర్భంగా పీడీ బి.వెంకటేశ్వర్ నాయక్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు హరికృష్ణ, యశ్వంత్, చైతన్య, రామానుజులు, హరితేజ, పవన్కళ్యాణ్, వెంకటేష్, సాయికుమార్, లక్ష్మీ సాగర్, చేతన్ హరికృష్ణ, ఎపిడి వెంకటేష్ పాల్గొన్నారు.

జాతీయ బేస్బాల్ జట్టుకు శ్రీజ ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట


జాతీయ బేస్ బాల్ జట్టుకు ఎంపికైన ఎన్.శ్రీజ

మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి ఎన్.శ్రీజ జాతీయ బేస్బాల్ జట్టుకు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠరావు తెలిపారు. గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు కాకినాడలో జరిగిన అండర్-17 బేస్బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైందని వారు తెలియజేశారు. ఈ పోటీలలో కడప జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. త్వరలో జరగబోయే పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొననుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీహరి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతి ఒక్కరూ రాణించాలని అన్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన శ్రీజను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అస్వస్థకు గురైన విద్యార్థిని

ప్రజాశక్తి-నందలూరు

పట్టణంలోని జ్యోతిబాపూలే బిసి గురుకుల బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న హాసిని అనే విద్యార్థిని అస్వస్థకు గురైంది. వివరాల్లోకి వెళితే హాసిని చదువుకునే సమయంలో కళ్ళు తిరిగి పడిపోయింది. ప్రిన్సిపల్, హౌస్ టీచర్, నర్స్ విద్యార్థిని ఆస్పత్రికి తరలించకుండా అస్వస్థకు గురైనట్లు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. హుటాహుటిన విద్యార్థిని తల్లి పాఠశాలకు చేరుకొని తన కూతురిని పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించింది. మానసిక సమస్యతోనే బాలిక అస్వస్థకు గురైనట్లు వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చు కున్నారు.

ఎన్నికల ముందే ముస్లింలు గుర్తుకొస్తారా?

ప్రజాశక్తి-రాయచోటి

వైసిపి నాయకులకు ఎన్నికల ముందే ముస్లిం మైనార్టీలు గుర్తుకొస్తారా అని నియోజకవర్గ టిడిపి నాయకుడు మండిపల్లి రాంప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హర్ దిల్ మే వైఎస్ఆర్, హమ్ సబ్ జగన్ కే సాత్ అనే పేరుతో వైసిపి చేపట్టిన కార్యక్రమం తర్జన భర్జలా ముగిసిందన్నారు. ముస్లిం మైనార్టీ కార్పోరేషన్ కింద ఒక రూపాయి కూడా నిధులు కేటాయించకుండా మోసం చేశారని అన్నారు. రాక్షస ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు.

భూసార పరీక్షపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

రైతులు ఎరువుల మీద ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందాలంటే పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్ట వలసి వుంటుందని కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సహదేవ పేర్కొన్నారు. గురువారం మూరెవాండ్లపల్లిలో భూసార పరీక్షపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు డాక్టర్ సహదేవ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పంటకు సిఫారసు మేరకు పోషకాలు అందించాలంటే భూసార పరీక్ష ఫలితాల ప్రకారం ఎరువుల యాజమాన్యం చేపట్టాలని తెలిపారు. భూసార పరీక్ష కొరకు మట్టి నమూనా సేకరించే విధానం, భూసార పరీక్ష ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో మూరివాండ్లపల్లి ఆర్టికె శివ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆపస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం స్థానిక ఆపస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి , కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి యం.నరసింహులు మాట్లాడుతూ 1982వ సంవత్సరంలో ఏర్పాటైన ఆపస్ ఉపాధ్యాయుల సమస్యల పోరాటంలోనే కాకుండా, విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందకు కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, లక్కిరెడ్డిపల్లె మండల అధ్యక్షులు నాగులయ్య, జివి.రమణ, చంద్రశేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగనోట్ల కేసులో ఎమ్మెల్యే సూత్రధారి : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్

రసపుత్ర రజనీ దొంగ నోట్ల కేసులో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్రెడ్డి ప్రధాన సూత్రధారుడని టిడిపి ప్రొద్దుటూరు ఇన్ఛార్జి డాక్టర్ ప్రవీణ్ కుమార్రెడ్డి పేర్కొన్నారు. గురువారం గాయత్రీ టవర్స్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే 48 గంటల్లో నకిలీ నోట్ల వ్యవహారం సిబిఐతో విచారించాలని లేఖ రాయాలన్నారు. లేకపోతే 48 గంటల తర్వాత ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గుట్టు విప్పుతానని చెప్పారు. రసపుత్ర రజని కర్ణాటక పోలీస్ స్టేషన్లో ఉండగా మా ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడాడని మీ చుట్టుపక్కన ఉన్న వారే చెబుతున్నారని తెలిపారు. 24వ తేదీ మీడియా సమావేశంలో తనకు మీతో పాటే నకిలీ నోట్ల వ్యవహారం నాకు తెలిసిందని చెప్పిన ఎమ్మెల్యే 20వ తేదీన ఎలా రసపుత్ర రజనీతో మాట్లాడారని ప్రశ్నించారు. 2016లో హైదరాబాదులో ఎమ్మెల్యే బామ్మర్ది, గోపల్లె గోవర్ధన ఏ కేసులో దొరికారో ఎమ్మెల్యే మీడియా ముందు చెప్పగలడా అన్నారు. నకిలీ నోట్ల చలామణి వ్యవహారంలో రసపుత్ర రజని ప్రతి మండలంలో ఇద్దరు నుంచి ముగ్గురిని వైసిపి నాయకులను ఏర్పాటు చేసి వారితో ఈ వ్యవహారం నడిపించిందని తెలిపారు. సంచలనమైన నకిలీ నోట్ల కేసు వ్యవహారంలో ప్రొద్దుటూరు పోలీసులు కనీసం ఏ ఒక్క చర్య తీసుకోకపోవడం గమనార్హమన్నారు. ముందు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పేర్కొన్నారు. రసపుత్ర రజనీని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని వైసిపి పెద్దలు, ఎమ్మెల్యే కేసును డైవర్ట్ చేస్తున్నారని చెప్పారు.

నేడు రైతుబజార్ ప్రారంభం

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సహకారంతో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు సారాధ్యంలో నేడు గురువారం రాయచోటిలో రైతుబజార్ను ప్రారంభిస్తున్నారు. ఇందుకోసం శరవేగంగా రైతుబజార్ను శుభ్రపరిచి రైతులను ఆకట్టుకునే విధంగా అందంగా తీర్చిదిద్దారు. వినియోగదారులకు అతి తక్కువ ధరలకే అన్ని రకాల కూరగాయలను అందుబాటులో ఉంచి రైతులు పండించిన పంటలను నేరుగా రైతు బజార్లో అమ్ముకునే విధంగా అధికారులతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేయడం శుభ పరిణామమని ప్రజలు చెప్పుకుంటున్నారు. రాయచోటి పట్టణ నడిబొడ్డులో ఉన్నటువంటి రైతుబజార్ ను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు కోరారు.

హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

మండలంలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థుల చేత బాత్రూంలు శుభ్రం చేయించడం దారుణమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగురవి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో కూడా ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయన్నారు. చదువుకోవాల్సిన విద్యార్థులతో పనులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, చైతన్య, సిద్ధార్థ పాల్గొన్నారు.

కడప-బెంగళూరు రైల్వే అలైన్మెంట్ను ఆమోదించండి

కేంద్ర రైల్వే శాఖ మంత్రికి ఎంపీ అవినాష్రెడ్డి వినతి

ప్రజాశక్తి - కడప


కేంద్ర రైల్వే శాఖ మంత్రి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ

కడప-బెంగుళూరు మధ్య మార్పు చేసిన కొత్త అలైన్మెంట్ను త్వరగా ఆమోదించాలని కోరు తూ గురువారం కడప ఎంపీ వైఎస్.అవినాష్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో 2021 జూన్లో ఈ సమస్యను ఏపి చీఫ్ సెక్రటరీ సమీర్శర్మ ద్వారా రైల్వే బోర్డు చైర్మన్ త్రిపాటి దృష్టికి తీసుకవచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం సిఫార్సు చేసిన ఆ కాఫీ ని కూడా కేంద్రమంత్రి దృష్టికి తీసుకపోయినట్లు చెప్పారు . గతంలో ఉన్న ఎక్కువ దూరం, రెండు రాష్ట్రాల మధ్య భూసేకరణ సమస్యకు ఎక్కువ కాలం పడుతుందని, మార్పు చేసిన ఈ కొత్త లైన్ ద్వారా తక్కువ దూరం తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చని దీన్ని త్వరగా ఆమోదించాలని కోరినట్లు పేర్కొన్నారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి జి. కిషన్ రెడ్డిని కలసి గండికోటను టూరిజం స్పాట్ గా తీర్చిదిద్దేందుకు సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. మంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ 'స్వదేశీ దర్శన్' అనే పథకం ద్వారా రూ.80 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారని అన్నారు. దాల్మియా సిమెంట్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సిఎస్ఆర్ ద్వారా మరి కొంత నిధులు దీనికే కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇటీవల భారీ వర్షాల సమయంలో సిద్దవటం కోటలోని పురాతన స్మారక చిహ్నాలు, ప్రహరీ గోడలు చాల వరకు దెబ్బతిన్నాయని పురాతన స్మారక చిహ్నాల పరిరక్షణ కోసం ,ప్రహరీ గోడల పునరుద్దరణ కొరకు తక్షణం చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత థామస్ రెడ్డి చిత్తా దంపతులు పోరుమామిళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాల బాలికలు 185 మందికి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధులు ఎల్. ప్రసాదరెడ్డి, జి. శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచితంగా టైలరింగ్


ప్రజాశక్తి - కడప

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్ కోర్సులలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18-45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలు ఉచిత శిక్షణ పొందేందుకు తెలిపారు. పూర్తి వివరాలకు 9440905478 నంబర్కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చునని తెలిపారు.

భవిత కేంద్రానికి క్యారమ్ బోర్డులు అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప పట్టణానికి చెందిన నెహ్రూ యువ కేంద్రం సహకారంతో స్థానిక ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం హౌసింగ్ బోర్డ్లో ఉన్న భవిత కేంద్రా నికి క్యారమ్ బోర్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ భవిత కేంద్రంలోని చెవిటి, మూగ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తూ నెహ్రూ యువ కేంద్రం సహకారంతో క్యారమ్ బోర్డులు అందజేశామన్నారు. ఆదరణ సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భవిత కేంద్ర నిర్వాహకురాలు సంగీత, ప్రేమ, ఆదరణ స్వచ్ఛంద ఉపాధ్యక్షుడు అమరావతి శ్రీనివాసులు, సభ్యుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.


తహశీల్దార్కు వినతి పత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విఆర్ఎలకు ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ పేర్కొన్నారు. సిఐటియు నాయకులు గురువారం తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విఆర్ఎ లకు చాలా మందికి స్మార్ట్ ఫోన్లు లేవని, కొందరికి వాటి వినియోగం తెలియదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని విఆర్ఎలకు నెట్వర్క్ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి వారికి ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఎలు నరసింహులు, శివయ్య, బుద్దెన్సాహెబ్, వెంకటరమణ, పెంచలయ్య పాల్గొన్నారు.


జాబ్మేళా కరపత్రాలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

మెగా జాబ్మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈనెల 10న పట్టణంలోని బిటి కళాశాలలో ఎంపీ మిథున్రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్బాషాల ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్మేళాను సద్వినియోగం చేసుకోవాలని 9వ వార్డు కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం జాబ్మేళాకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలనకు ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక కృషి చేస్తున్నారని అన్నారు. ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ, ఎంబిఎ, ఎంసిఎ, ఎంకామ్ ఎంఎస్సి, ఇంజనీరింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసం జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాకు హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకొని ఉద్యోగవకాశాన్ని పొందాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. జాబ్మేళా ఏర్పాటుకు ఎంపీ, ఎమ్మెల్యేల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న టెంపో

ఒకరు మృతి, డ్రైవర్కు గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణ శివారులోని చిత్తూరు రోడ్డులో ఆగి ఉన్న లారీని టెంపో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో చోటు చేసుకున్న ఘటనపై పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. రేణిగుంట నుండి విద్యుత్ స్తంబాల లోడుతో భారీ వాహనం సుండుపల్లికి వెళ్లే క్రమంలో పీలేరు రిలయన్స్ పెట్రోల్ బంక్ దగ్గర టీ తాగేందుకు డ్రైవర్ లారీని రోడ్డుపక్కన ఆపాడు. వెనుక నుండి వేగంగా వచ్చిన టెంపో ఆగివున్న భారీ వాహనాన్ని ఢీ కొనడంతో పదిపుట్లబైలు గ్రామానికి చెందిన నాగరాజ అనే వ్యక్తి మృతి చెందగా, డ్రైవర్కు తీవ్ర గాయాలు అయ్యాయి. టెంపో ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -బి.కొత్తకోట

కర్నాటక రాష్ట్రం నుండి అక్రమంగా మద్యం ప్యాకెట్లు తరలి స్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.40వేలు విలువైన మద్యం ప్యాకెట్లు, రూ.4లక్షలు విలువైన కారును స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గురువారం తన సిబ్బంది ఎఎస్ఐ బొజ్జినాయక్, హెడ్ కానిస్టేబుల్స్ రవీంద్ర నాయక్, నాగరాజు గౌడ్, విజయ్ కుమార్, కానిస్టేబుళ్లు వెంకటరమణ, లక్ష్మీనారాయణ, శేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. నాయనబావి గ్రామ పంచాయతీ నాయనబావి-మొటుకు రోడ్డు నందు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మద నపల్లి పట్టణం, నీరుగుట్టువారిపల్లి, కుమ్మరవీధికి చెందిన ఎర్రి రామలింగప్ప కుమారుడు ఎర్రి నరేంద్ర, చెన్నక్క శ్రీరాములు కుమారుడు చెన్నక్క మంజునాథ్ అనే ఇద్దరు యువకులు ఎపి11 ఏఎస్ 5024 నెంబరు గల టొయోటా ఇతియోస్ కారులో అక్రమంగా కర్నాటక రాష్ట్రం నుండి మద్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.40 వేలు విలువైన ఓల్డ్ అడ్మిరల్ విఎస్ఒపి బ్రాందీ, 180 ఎంఎల్ పరిమాణం కలిగిన ప్యాకెట్లు 240, డికె డబుల్కిక్ ఫైన్విస్కీ 180 ఎంఎల్ పరిణామం కలిగిన ప్యాకెట్లు 144, మొత్తం 384 మద్యం ప్యాకెట్లు, రూ.4లక్షలు విలువ చేసే కారును స్వాదీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయ స్థావరాలపై దాడులు నిర్వహించి ఎనిమిది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, ఒక మహిళ పై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఫాతిమా తెలిపారు. వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయనపల్లికు చెందిన ఎం.అక్కులు అనే మహిళ గురువారం ఉదయం బాలినాయనపల్లి సమీపంలోని చింతచెట్టు కింద సారాను విక్రయిస్తుండగా పోలీసులు దాడుల నిర్వహించి, ఆమె వద్ద నుంచి ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సాటుసారా తయారు చేసే వారు వారి పద్దతులను మార్చుకోవాలని సూచించారు. నాటుసారా తయారు చేయడం నేరమన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం శిక్షకు గురవుతారని ఎస్ఐ హెచ్చరించారు.